క్లుప్తంగా

ఆర్‌ఎంపీల సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా వెంకటప్పాచారి


వెంకటప్పాచారి

మునగాల : తెలంగాణ ఆర్‌ఎంపీ, పీఎంపీల సంక్షేమ సంఘం మునగాల మండల శాఖ అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన వెలిదె వెంకటప్పాచారి నియమితులయ్యారు. మంగళవారం మండల కేంద్రంలోని రఘునాథం మిల్లు ఆవరణలో మండలంలోని ఆర్‌ఎంపీలు, పీఎంపీలకు జరిగిన సమావేశంలో సంఘం రాష్ట్ర నాయకుడు బ్రహ్మం, సూర్యాపేట జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బెల్లంకొండ డాంగే సమక్షంలో వెంకటప్పాచారిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు వారు నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు తన్నీరు సత్యనారాయణ, నాగరాజు, ఆర్‌ఎంపీ, పీఎంపీ వైద్యులు లింగయ్య, చంద్రమౌళి, శంకర్, బుర్రి శ్రీను, జానీపాషా, అంజి, కత్తి వెంకన్న, రాజు పాల్గొన్నారు.

చింతలపాలెం ఎస్‌ఐగా సైదిరెడ్డి బాధ్యతల స్వీకరణ


ఎస్‌ఐ సైదిరెడ్డి

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం ఎస్‌ఐగా ఎ.సైదిరెడ్డి మంగళవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన హరీష్‌రెడ్డిని జిల్లా ఉన్నతాధికారులు సూర్యాపేట హెడ్ క్వార్టర్‌కు అటాచ్ చేశారు. దీంతో నల్లగొండలో డీఎస్‌బీలో ఉన్న ఎస్‌ఐ సైదిరెడ్డి చింతలపాలెంకు బదిలీపై వచ్చారు.

వీరబ్రహ్మేంద్రస్వామి పాదాలు తాకిన సూర్యకిరణాలు



మునగాల : మండల కేంద్రంలో శ్రీమద్విరాట్ పోతూలూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో దక్షిణాయన పుణ్యకాలం సమయంలో మంగళవారం సూర్యకిరణాలు స్వామివారి పాదాలను తాకాయి. ఆలయ పూజారి బాణాల లక్ష్మణాచారి స్వామివారి పూజ కోసం ఆలయ ద్వారాలు తెరువగా కనిపించిన ఈ అద్భుతాన్ని వెంటనే ఆలయ కమిటీకి తెలియజేశారు. దీంతో ఈ అద్భుతాన్ని చూసేందుకు పరిసర ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి దర్శించుకొని తరించారు. ఇలాంటి అద్భుతం అరుదుగా వస్తుందని ఆలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు ముత్యాల సత్యనారాయణ తెలిపారు.

మండల వ్యవసాయ అధికారిగా జావీద్


జావీద్

నేరేడుచర్ల : నేరేడుచర్ల మండల వ్యవసాయ అధికారిగా ఎస్‌కే జావీద్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేసిన వీరభద్రారావు దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో ఆయన స్థానంలో మహబుబ్‌బాద్‌లో వ్యవసాయ అధికారిగా పనిచేస్తున్న జావీద్ బదిలీపై నేరేడుచర్లకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

నర్సరీల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి

మోతె : నర్సరీల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని మండల ప్రత్యేక అధికారి తిర్పతయ్య సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నర్సరీల నిర్వహణపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామల్లో నర్సరీల్లో మొక్కల పెంపకంలో పెండింగ్ పనులను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటాచారి, ఏపీఓ మహేష్, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

బూరుగడ్డ ఆలయంలో ప్రత్యేక పూజలు


పూజలు చేస్తున్న అర్చకులు, భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో గల శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి దేవాలయంలో బహుళ ఏకాదశి నక్షత్ర మాఘ పూజలను మంగళవారం అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, ఫల పుష్పార్చన, ఆరాధన, అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం, సేవాకాలం, అలంకరణ, మంగళశాసనం తదితర పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం దాత దేశగాని సాంబశివగౌడ్‌– సుధ దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గండు సైదులు, ధర్మకర్తలు సురభి కుషల్, పూర్ణ, సైదులు, నర్సింహారావు, వెంకటనారాయణ, కార్యనిర్వాహణాధికారి ఎంపీ లక్ష్మణరావు, అర్చకులు ముడుంబై హరీష్‌కుమార్‌చార్యులు, మనోహరాచార్యులు, కిరణ్‌కుమార్ గౌడ్, ఉపేందర్, రమేష్, భక్తులు పాల్గొన్నారు.

‘గృహలక్ష్మి’ కటాక్షించేనా..

- మండలంలో 1038 దరఖాస్తులు
- అర్హులకే పథకం వర్తింపజేయాలి
- రాజకీయ జోక్యం ఉండొద్దని వేడుకోలు


గోపాలపురంలో గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్న నిరుపేద

హుజూర్‌నగర్‌రూరల్ : ఇళ్లు లేని నిరుపేదల సొంతింటి కలను నిజం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం గృహలక్ష్మి పథకాన్ని తీసుకొచ్చి ఇంటి నిర్మాణానికి రూ.3 లక్షల సాయం అందిస్తోంది. దీంతో హుజూర్‌నగర్ మండలంలో గృహలక్ష్మి పథకానికి అనేకమంది ప్రజలు దరఖాస్తు చేసుకున్నారు. మరికొద్ది రోజుల్లో అర్హుల జాబితా వెలువడనుంది. దీంతో మండలంలో ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న పేద ప్రజలు ‘గృహలక్ష్మి’ కటాక్షిస్తుందో, లేదోనని వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. పథకాన్ని త్వరగా అమలు చేసి తమ ఇంటి గోసను తీర్చాలని గుడిసెలు, రేకుల ఇళ్లలో నివసిస్తున్న పేదలు కోరుతున్నారు.

మండలంలో 1038 దరఖాస్తులు

గృహలక్ష్మి పథకానికి మండలంలోని వేపలసింగారం, గోపాలపురం, అమరవరం, లక్కవరం, శ్రీనివాసపురం, అంజలిపురం, కరక్కాయలగూడెం, బూరుగడ్డ, మగ్రిగూడెం, లింగగిరి, సీతారాంపురం గ్రామ పంచాయతీల నుంచి 1038 మంది దరఖాస్తు చేసుకున్నారు. అందులో వివిధ గ్రామాల్లో ఇళ్లు లేని నిరుపేదలు 850 మందిని అధికారులు అర్హులుగా గుర్తించి జాబితా తయారు చేశారు. ఈ జాబితాను ఎమ్మెల్యే పరిశీలించి కలెక్టర్‌కు పంపించగా వారిలో గ్రామాల వారీగా ఇళ్ల కేటాయింపును బట్టి పేర్లు ప్రకటించాల్సి ఉంది.

రాజకీయ జోక్యం ఉండొద్దు

గృహలక్ష్మి పథకంలో రాజకీయ జోక్యం నివారించి అర్హులైన వారికి ఇళ్లు కేటాయించాలని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. డబుల్ బెడ్ రూం ఇళ్ల కేటాయింపులో జరిగిన అక్రమాల మాదిరి గృహలక్ష్మి పథకంలో జరగకుండా చూడాలని కోరుతున్నారు. పేదల కష్టాలు గుర్తించి పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, స్థలాలు లేని వారికి స్థలాలు ఇవ్వాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఇల్లు కట్టుకునే స్థోమత లేదు

ఇల్లు కట్టుకునే స్థోమత లేకపోవడంతో రేకుల ఇంట్లో ఉంటున్నాం. గృహలక్ష్మి పథకం కోసం దరఖాస్తు చేసుకున్నాం. మాకు ఇల్లు మంజూరు చేస్తే పక్కా ఇల్లు నిర్మించుకుంటాం. దీంతో మా బాధలు తీరుతాయి.

– గంజాయి లింగయ్య, బూరుగడ్డ

అర్హులకే ఇళ్లు ఇవ్వాలి

గృహలక్ష్మి పథకం అర్హులకే వర్తింపజేయాలని ఎమ్మెల్యే, అధికారులకు విజ్ఞప్తి చేశాం. రాజకీయ నాయకుల జోక్యంతో అర్హులైన నిరుపేదలు నష్టపోవాల్సి వస్తుంది. ఇలా జరగకుండా చూడాలి.

– పోషణబోయిన హుస్సేన్, సీపీఎం మండల కార్యదర్శి, హుజూర్‌నగర్

ఉత్తమ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరికలు


కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎంపీ ఉత్తమ్

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌కు చెందిన బీసీ సంఘం నాయకుడు చనగాని బాలకృష్ణగౌడ్, శ్రీనివాసపురంనకు చెందిన పి.ఉపేందర్‌లు మంగళవారం హైదరాబాద్‌లో ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఎంపీ ఉత్తమ్ కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కోతి సంపత్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సులువ చంద్రశేఖర్, పోతనబోయిన రామ్మూర్తి, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం

- ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి


పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే సైదిరెడ్డి

హుజూర్‌నగర్ : పార్టీలో చేరిన ప్రతి కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. మంగళవారం మేళ్లచెరువు మండలంలోని హేమ్లాతండా, జగ్గుతండాల్లో వివిధ పార్టీలకు చెందిన పలువురు హుజూర్‌నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పలువురు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నట్లు చెప్పారు. నాయకులు శోభన్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో అలసత్వం ప్రదర్శించొద్దు

- ఆర్డీఓ సూర్యనారాయణ


ఎన్నికల నిబంధనలు వివరిస్తున్న అధికారి

కోదాడ : ఎన్నికల విధుల్లో భాగస్వాములయ్యే అధికారులు, సిబ్బంది ఎన్నికల నిబంధనలను తూచ తప్పకుండా పాటించాలని, అలసత్వం ప్రదర్శించొద్దని కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ కోరారు. మంగళవారం కోదాడ ఆర్డీఓ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయిలో ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారుల, సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల సిబ్బంది విధులు, ఎన్నికల నియమాలను అధికారులు వివరించారు. అధికారులు విధుల్లో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, ఎలాంటి ఫిర్యాదులకు అవకాశం ఇవ్వవద్దని కోరారు. కార్యక్రమంలో కోదాడ డీఎస్పీ ప్రకాశ్, సీఐలు, ఎస్‌ఐలు, తహసీల్దార్‌లు, రెవెన్యూ సిబ్బంది, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

- రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి



మాట్లాడుతున్న ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, పక్కన అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు

హుజూర్‌నగర్ : అసెంబ్లీ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సోమవారం నుంచి ఎన్నికల నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్) అమలులోకి వచ్చిందని చెప్పారు. ఇక నుంచి అధికారులంతా ఎన్నికల కమిషన్ నియమ నిబంధన ప్రకారం విధులు నిర్వహించాలన్నారు. నియోజకవర్గంలో మొత్తం 308 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని, అన్ని పోలింగ్ స్టేషన్లలో ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. 40 శాతం కంటే ఎక్కువ అంగవైకల్యం ఉన్నా, 80 ఏళ్లు పైబడిన వయోవృద్ధులు రాతపూర్వకంగా తెలియజేస్తే వారికి ప్రత్యేకంగా రహస్య ఓటింగ్ నిర్వహిస్తామన్నారు. ఎన్నికల నోడల్ ఆఫీసర్, ఏఎస్పీ నాగేశ్వరరావు మాట్లాడుతూ నియోజకవర్గంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టి శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల్లో తాయిలాలు, మద్యం, గంజాయిని నిరోధించడానికి పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అనంతరం ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డీఎస్పీ ప్రకాష్, తహసీల్దార్ నాగార్జునరెడ్డి, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతుల్లో వేపలసింగారం సర్పంచ్


శిక్షణ తరగతుల్లో పాల్గొన్న సర్పంచ్ అన్నెం శిరీష

హుజూర్‌నగర్‌రూరల్ : హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో పంచాయతీ రాజ్ ఆధ్వర్యంలో మహిళా సర్పంచ్‌లకు ‘పంచాయతీ రాజ్ సంస్థల్లో మహిళలు’ అనే అంశంపై 3 రోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణకు హుజూర్‌నగర్ మండలంలోని వేపలసింగారం సర్పంచ్ అన్నెం శిరీషాకొండారెడ్డి మంగళవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. అక్టోబర్ 10 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్న శిక్షణలో భాగంగా మొదటిరోజు గ్రామ పరిపాలనలో మహిళా సర్పంచ్‌ల అనుభవాలు, మహిళా ప్రజాప్రతినిధుల్లో నాయకత్వ నైపుణ్యాలు, లక్షణాలు, తెలంగాణ పంచాయితీరాజ్ చట్టం 2018 గ్రామ పంచాయతీ విధులు, బాధ్యతలు, జీవితచక్ర విధానంలో జెండర్ సమస్యల విశ్లేషణ, ఆడపిల్లల జననం, బాల్యవివాహాలు, గ్రామ పరిపాలనలో మహిళా సర్పంచ్‌ల కుటుంబ సభ్యుల జోక్యం, మహిళా సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామ సభ నిర్వహణ వంటి కార్యక్రమాలపై మొదటి రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు ఆమె తెలిపారు.

ఆరు గ్యారంటీలతో కాంగ్రెస్ గెలుపు ఖాయం

- కోదాడ మాజీ ఎమ్మెల్యే పద్మావతి


ఈదులవాగుతండాలో గ్యారంటీ కార్డులు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మావతి

మునగాల : రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో ఆరు గ్యారంటీ పథకాలతో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, కోదాడ మాజీ ఎమ్మెల్యే ఎన్.పద్మావతిరెడ్డి జోస్యం చెప్పారు. గడపగడపకు కాంగ్రెస్ పార్టీ ప్రచార యాత్రలో భాగంగా మంగళవారం ఆమె మండలంలోని ఈదులవాగుతండా, నేలమర్రి, వెంకట్రాపురం, తాడువాయి, మాధవరం, విజయరాఘవపురం, రేపాల, సీతానగరం, నర్సింహులగూడెం, జగన్నాథపురం గ్రామాల్లో పర్యటించారు. తొలుత ఈదులవాగు తండాలోని ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాల గురించి ఆమె ప్రజలకు వివరించి గ్యారంటీ కార్డులను పంపిణీ చేశారు. ఈదులవాగుతండా, నేలమర్రి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు నలబోలు సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో పద్మావతి సమక్షంలో బీఆర్‌ఎస్, సీపీఎం పార్టీల నుంచి 200 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. తాడువాయిలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొలిశెట్టి బుచ్చిపాపయ్య ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ కోదాడలో కాంగ్రెస్‌కు 50 వేల మెజార్టీ వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల్లో అవినీతి బీఆర్‌ఎస్ పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, పార సీతయ్య, వంగవేటి రామారావు, మండల నాయకులు కొప్పుల జైపాల్‌రెడ్డి, జిల్లేపల్లి వెంకటేశ్వర్లు, భీమపంగు శంకర్, బచ్చు అశోక్, దేవినేని రవి, ఉప్పల జానకిరెడ్డి, ఎండీ.రషీద్, మాతంగి బసవయ్య, మండవ చంద్రయ్య, పనస విజయ్, లక్ష్మీనారాయణ, భిక్షంరెడ్డి, కాసర్ల బోస్, కాసర్ల కోటేశ్వరరావు, అమరబోయిన మట్టయ్యయాదవ్, కాలె సామియేలు పాల్గొన్నారు.

లక్ష్యం.. 3.50 కోట్ల చేపపిల్లల పంపిణీ


ఊరచెరువులో చేప పిల్లలను వదులుతున్న అధికారులు, మత్స్య సొసైటీ సభ్యులు

నేరేడుచర్ల : సూర్యాపేట జిల్లాలోని 650 చెరువుల్లో 3 కోట్ల 50 లక్షల చేప పిల్లలను వదలడమే లక్ష్యంగా ప్రణాళిక సిద్ధం చేసినట్లు మత్స్యశాఖ ఎఫ్‌ఏ ఉపేందర్ తెలిపారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని ఊర చెరువులో మత్స్య సొసైటీ సభ్యులతో కలిసి చేప పిల్లలను వదిలారు. అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ముదిరాజుల అభ్యున్నతికి ప్రతి ఏడాది ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. నేరేడుచర్లలోని ఊర చెరువులో 72 వేల చేప పిల్లలు వదిలినట్లు తెలిపారు. కార్యక్రమంలో మత్స్య సొసైటీ అధ్యక్షుడు పేరబోయిన వీరయ్య, ప్రధాన కార్యదర్శి కాసాని సైదులు, ఉపాధ్యక్షుడు నందిపాటి మట్టయ్య, వడ్డేగాని సైదులు, ఇంజమూరి వెంకన్న, సభ్యులు చిలకరాజు చంటి, శ్రీనివాసాచారి, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

13న స్వామినాథన్ సంతాప సభ

హుజూర్‌నగర్ : దేశంలో ఆకలి కేకలు వినిపించిన కాలాన్ని అధిగమించి ఆహార ధాన్యాలు ఎగుమతి చేసే స్థాయికి తెచ్చిన ఘనత డాక్టర్ స్వామినాథన్‌దేనని అఖిలపక్ష నాయకులు అన్నారు. మంగళవారం హుజూర్‌గనర్‌లో పట్టణ అఖిల పక్ష కమిటీ నాయకుల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హుజూర్‌నగర్‌లోని రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ భవన్‌లో హరిత విప్లవ పితామహుడు డాక్టర్ స్వామినాథన్ సంతాప సభ ఈనెల 13న నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కోటేశ్వరరావు, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లు నాగార్జున రెడ్డి తదితరులు సంతాప సభలో పాల్గొంటారని వారు చెప్పారు. సమావేశంలో ప్రజాసంఘాల నాయకులు కొప్పోజు సూర్యనారాయణ, గూడెపు శ్రీనివాస్, దుగ్గి బ్రహ్మం, దొంగరి వెంకటేశ్వర్లు, మేకల నాగేశ్వరరావు, చందర్‌రవు, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

50 మంది మహిళలకు వైద్య పరీక్షలు

నేరేడుచర్ల : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఆరోగ్య మహిళా కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా 50 మంది మహిళలకు డాక్టర్ నాగిని వైద్య పరీక్షలు నిర్వహించారు. 19 మంది మహిళల రక్త సమూనాలను జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన టీ హబ్‌కు పంపించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది జయమ్మ, యోధ, నాగేంద్రమ్మ, జగదీశ్వరమ్మ, క్రాంతి ఉన్నారు.

హైకోర్టులో కరివిరాల సర్పంచ్‌కు ఊరట

నడిగూడెం : మండల పరిధిలోని కరివిరాల గ్రామ సర్పంచ్ గుర్రం నీలిమా గాంధీకి హైకోర్టులో ఊరట లభించింది. ఇటీవల ఆమెపై వచ్చిన పలు ఆరోపణలతో ఆమె చెక్కు పవర్ రద్దు చేయడంతో పాటు పదవి నుంచి తొలగించారు. దీంతో ఆమె హైకోర్టును ఆశ్రయించడంతో హైకోర్టు మంగళవారం స్టే విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు సర్పంచ్ గుర్రం నీలిమా గాంధీ నడిగూడెంలో విలేకరులకు తెలిపారు. తనపై పలువురు సంబంధిత జిల్లా, మండల అధికారులతో పాటు పంచాయతీ కార్యదర్శితో తప్పుడు ఆరోపణలు చేయించి, తప్పుడు కేసులను బనాయించి కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆమె ఆరోపించారు. హైకోర్టు తీర్పుతో తనకు న్యాయం జరిగిందన్నారు.

మత్స్యకారుడి వలకు చిక్కిన కొండచిలువ



మఠంపల్లి : మండలంలోని యాతవాకిళ్ల వద్ద గల వేములూరు రిజర్వాయర్‌లో మత్స్యకారుడు మెండె కొల్లయ్య వేసిన వలలో 15 అడుగుల కొండచిలువ చిక్కింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వేములూరు రిజర్వాయర్‌లో సోమవారం సాయంత్రం కొల్లయ్య వలలు వేసి మంగళవారం ఉదయాన్నే వెళ్లి చూడగా సుమారు 15 అడుగుల పొడవు గల భారీ కొండచిలువ వలలో చిక్కి చనిపోయి ఉంది. దీంతో కొండచిలువను ఒడ్డుకు తీసుకురాగా మత్స్యకారులతో పాటు స్థానిక ప్రజలు ఆసక్తిగా చూశారు. కాగా మత్స్యకారులు రిజర్వాయర్‌లో చేపల వేట సాగించే సమయంలో జాగ్రత్తగా ఉండాలని స్థానిక మాజీ సర్పంచ్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కోలాహలం కృష్ణంరాజు సూచించారు.

ఫ్లెక్సీలు, వాల్ పోస్టర్ల తొలగింపు


వాల్‌పోస్టర్లను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

మునగాల : ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో మండల కేంద్రంలో వివిధ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు, వాల్ పోస్టర్లు, వాల్ రైటింగ్స్‌లను గ్రామపంచాయతీ సిబ్బంది మంగళవారం తొలగించారు. ఇందులో భాగంగా వాల్ రైటింగ్స్ కనిపించకుండా సున్నం వేయడం, ఫ్లెక్సీలను తొలగిస్తున్నట్లు సర్పంచ్ చింతకాయల ఉపేందర్ తెలిపారు.

పార్టీ స్థూపాల మూసివేత

నడిగూడెం : ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన సందర్భంగా నడిగూడెం మండలంలో రాజకీయ పార్టీల స్థూపాలు, నాయకుల విగ్రహాలు కనబడకుండా మూసివేసే పనులను అధికారులు చేపడుతున్నారు. అదేవిధంగా వాల్ రైటింగ్‌లను తుడిచివేస్తూ, వాల్ పోస్టర్లను తొలగిస్తున్నారు.

పకడ్బందీగా విధులు నిర్వహించాలి

మఠంపల్లి : అధికారులు, ఉద్యోగులు అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ విధులు పకడ్బందీగా నిర్వహించాలని మండల స్పెషల్ ఆఫీసర్, అగ్రికల్చరల్ ఏడీఏ సంధ్యారాణి కోరారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులు, కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అదేవిదంగా అన్ని గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేయనున్న నర్సరీలపై అవగాహన కల్పించారు. సమావేశంలోఎంపీడీఓ జానకిరాములు, ఎంపీఓ ఆంజనేయులు, ఏపీఓ ఉమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలి

మునగాల : బీఆర్‌ఎస్ పార్టీ గ్రామ కోఆర్డినేటర్లు పార్టీ గెలుపునకు కృషిచేయాలని పార్టీ మండల అధ్యక్షుడు తొగరు రమేష్, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు సుంకర అజయ్‌కుమార్ కోరారు. మంగళవారం మండలంలోని మాధవరం, బరాఖత్‌గూడెం, ముకుందాపురం, ఆకుపాముల, కోదండరామాపురం, నర్సింహాపురం గ్రామాల్లో నిర్వహించిన బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో బీఆర్‌ఎస్ కార్యకర్తలు సమావేశాలు నిర్వహించి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు కందిబండ సత్యనారాయణ, ఎలక నరేందర్‌రెడ్డి, ఉప్పల యుగంధర్‌రెడ్డి, గోపిరెడ్డి నాగిరెడ్డి, ఎలక కవిత, నంద్యాల విజయలక్ష్మి, శ్యామ్‌సుందర్‌రెడ్డి, దార వెంకన్న, శాఖమూడి సత్యనారాయణ, ఐతరాజు వీరు, షేక్ సైదా, రాణి, గ్రామ శాఖల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతుల విరాళాలతో కాల్వ పూడికతీత


పూడికతీత పనులను ప్రారంభిస్తున్న రైతులు

నడిగూడెం : మండల పరిధిలోని సాగర్ ఎడమ కాల్వకు అనుబంధంగా ఉన్న పాలారం మేజరు కాల్వ పలు చోట్ల పూడిపోయి, కంపచెట్లు ఉండడంతో కాల్వ చివరి భూములకు నీరందడం లేదు. దీంతో మంగళవారం ఆ కాల్వ పరిధిలోని వల్లాపురం, త్రిపురవరం, చనుపల్లి గ్రామాలకు చెందిన రైతులు స్వచ్ఛందంగా సేకరించిన విరాళాలతో వల్లాపురం కొట్టాల బావి నుంచి కాల్వ జీరో వరకు పూడికతీత, కంపచెట్లు, నాచు తొలగింపు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో గుర్రం వెంకటరెడ్డి, వీరయ్య, వెంకటేశ్వర్లు, వీరారెడ్డి, భూపాల్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

నెరవేరిన రైతుల ఆకాంక్ష


గంగకు పూజలు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయికులు

హుజూర్‌నగర్ : రైతుల ఆకాంక్షను ప్రభుత్వం నెరవేర్చిందని బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు చిట్యాల అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణ పరిధిలో ఉన్న సాగర్ కాలువలో గంగకు పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎడమ కాలువకు నీటిని విడుదల చేయడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు అమర్‌గౌడ్, వెంకట్ రెడ్డి, రామ్‌రెడ్డి, ముక్కంటి, సైదులు, నరసింహారావు, చంటి, నాగరాజు రైతులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ‘మధ్యాహ్న’ కార్మికుల సమ్మె


సమ్మె చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

మఠంపల్లి : మండల కేంద్రంలో మధ్యాహ్న భోజన కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మె 13వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా పలువురు కార్మికులు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి, పెరుగున్న నిత్యావసరాల ధరలను పరిగణనలోకి తీసుకొని వేతనాలు పెంచి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ సయ్యద్‌రసమియా, యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు శాంతాకుమారి, ధనమ్మ, లచ్చీరాం, గోవిందమ్మ, సాలమ్మ, సత్యవతి, పద్మ, లక్ష్మి, భద్రమ్మ, శాంతి, నాగమణి, రాజ్యలక్ష్మి, మంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వర్క్‌షాప్‌ను విజయవంతం చేయాలి

నడిగూడెం : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మల్లు వెంకటనర్సింహారెడ్డి భవన్‌లో ఈ నెల 12న నిర్వహించబోయే స్వామివిశ్వనాథన్ వర్క్‌షాప్‌ను విజయవంతం చేయాలని రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు ఏనుగుల వీరాంజనేయులు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ వర్క్‌షాప్‌కు రాష్ట్ర నాయకుడు సారంపల్లి మల్లారెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు. రైతు సంఘం సభ్యులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

పాస్టర్లు సామాజిక అభివృద్ధికి పాటుపడాలి

కోదాడరూరల్ : పాస్టర్లు సామాజిక అభివృద్ధి తమవంతు పాటుపడాలని పాస్టర్ డాక్టర్ వి.యేసయ్య అన్నారు. మంగళవారం పట్టణంలోని నయానగర్‌లో గల బాప్టిస్ట్ చర్చిలో ప్రపంచ పాస్టర్స్ డే సందర్భంగా నిర్వహించిన ఆరాధన కార్యక్రమంలో మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యురాలు వంటిపాక జానకియేసయ్య, కోటయ్య, జగ్గునాయక్, జాన్, మోజేష్, జ్యోతి, మౌనిక, మేరమ్మ, ద్రాక్షవల్లి ఉన్నారు.

ఇంటి స్థలం కేటాయించాలి

హుజూర్‌నగర్ : పులిచింతల ప్రాజెక్టు ముంపు కింద కోల్పోయిన ఇంటికి సంబంధించి ప్రభుత్వం పరిహారం అందజేసి ఇంటి స్థలం కేటాయించలేదని చింతలపాలెం మండలం వెల్లటూరు గ్రామానికి చెందిన అన్నపురెడ్డి కోటిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ విషయమై కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసినట్లు చెప్పారు. తనకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

అయోమయంలో వీఆర్‌ఏలు

గరిడేపల్లి : మండల కేంద్రంలో వీఆర్‌ఏలు సర్దుబాటు అశాస్త్రీయంగా చేపట్టడంతో, వారి పరిస్థితి అయోమయంగా ఉందని సీఐటీయూ జిల్లా నాయకుడు ఎస్‌కె యాకూబ్ అన్నారు. మంగళవారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ కోర్టులో కేసు నడుస్తుండటంతో వీఆర్‌ఏలకు వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎన్నికల కోడ్ రావడంతో తమ పరిస్థితి ఏంటని వీఆర్‌ఏలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పిచ్చమ్మ, వీరబాబు, శ్రీను, నర్సయ్య, రామయ్య, అనీల్, రంజిత్, పుల్లయ్య, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం


అన్నదానం చేస్తున్న దాతలు, నిర్వాహకులు

కోదాడరూరల్ : పట్టణంలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం దాతలు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృతాభిషేకాలు, ఆకుపూజ, పుష్పాలంకరణ వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దాతలు గుండా సోమేశ్వరరావు, వెంకటలక్ష్మి, ప్రవీణ్‌కుమార్, సత్యనారాయణ, సుమతి, హుస్సేన్‌రావు, విజయలక్ష్మి, మాధవి, నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు ఉన్నారు.

చిలుకూరులో..

చిలుకూరు : మండల కేంద్రంలో కాలువ ఒడ్డున గల అభయాంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం నారాయణపురం గ్రామానికి చెందిన బూర లక్ష్మీనారాయణ– వసంత దంపతులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కొడారు బాబు, ఆలయ కమిటీ చైర్మన్ దొడ్డా శ్రీను, ఆలయ పూజారి ఆర్కే ఆచార్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సాగర్ నీటితో చెరువులు, కుంటలు నింపాలి

హుజూర్‌నగర్‌రూరల్ : సాగర్ ఎడమ కాలువ ద్వారా విడుదలవుతున్న నీటితో చెరువులు, కుంటలను వెంటనే నింపాలని హుజూర్‌నగర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని బూరుగడ్డలో రైతులు, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. భూగర్భ జలాలు తగ్గిపోవడంతో బోరు, బావుల కింద వేసిన వరి పొలాలకు నీరందక లేక పొట్ట దశలో ఎండిపోతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కోటయ్య, నిర్మల, కృష్ణారెడ్డి, బాలాజీ, రైతులు ఉన్నారు.